సీవేజ్ ప్లాంట్‌కు అవినీతి భూతం!



జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని నరవ సమీపంలోని సత్తివానిపాలెంలో 9 ఏళ్ల కిందట సీవేజ్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇందు కోసం రూ.942 కోట్లు ఖర్చు చేశారు. అలాంటి ప్రాజెక్టు కొందరి ధన దాహం.. ఇంకొందరి నిర్లక్ష్యం వల్ల ప్రయోజనం లేకుండా పోయింది. ప్రజా ధనం పక్కదారి పడుతోంది.పరిసర ప్రాంత వాసులు, కిందస్థాయి కార్మికులు దుర్వాసన భరించలేక సతమతమవుతున్నారు.

-గోపాలపట్నం

- నిర్వహణ లేక పనిచేయని యంత్రాలు
- ఉత్పత్తికి ముందే మొరాయిస్తున్న సీవేజ్ ప్లాంట్
- విషతుల్యంగా మారుతున్న నీరు
- మెయింటెనెన్స్ నిధులు హాంఫట్



విషతుల్యంగా మారిన ఒక చాంబర్‌లో నీరు

విశాఖ నగరం నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసి నగర వాసులు, పరిశ్రమలు వాడుకునేందుకు పంపిణీ చేస్తారు. అయితే అధికారుల నిర్లక్ష్యం ,, కింది స్థాయి ఉద్యోగుల ధన దాహంతో మూలకు చేరింది. నగరం నుంచి వచ్చే యూజీడీ వాటర్‌ను ఈ సీవేజ్ ప్లాంట్ శుద్ధి చేస్తుంది. పలు యంత్రాలు ఆ పనులు చేస్తాయి. అయితే మెయింటెనెన్స్ లేకపోవడంతో చాలా మేరకు నెమ్మదించాయి. మరి కొన్ని మూలకు చేరాయి. దీంతో ఇక్కడి పనిని సిబ్బందే మాన్యువల్‌గా చేస్తున్నారు.

సీవేజ్ ప్లాంట్ పని తీరు ఇలా..

అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నుంచి వచ్చే మురుగు నీరు పంప్ హౌస్‌లకు చేరి అక్కడి పంపింగ్ ద్వారా నరవ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ 108 మెట్రిక్ లీటర్ పెర్‌డే(ఎంఎల్‌డీ)లోకి వస్తుంది. ఇన్‌లైట్ చాంబర్‌కు చేరుతోంది. మ్యాన్‌హోల్ స్క్రీన్‌లో వ్యర్థాలకు బయటకు పంపుతుంది. ఇక్కడ నుంచి మెకానికల్ స్క్రీన్ కు వస్తుంది. చాంబర్ల నుంచి డిక్టేటర్లకు చేరుతుంది. ఇక్కడ రాకింగ్ చాంబర్ సిల్ట్ తీస్తుంది. అనంతరం వేరియేషన్ ట్యాంక్‌లోకి ఈ నీరు చేరుతుంది. డిఫ్యూజర్లు, బ్లోయర్ల ద్వారా నీటిలో ఆక్సిజన్ స్థాయి పెరుగుతుంది. ఇక్కడి నుంచి క్లారిఫైలో వాటర్ ట్రీట్‌మెంట్ జరుగుతుంది. ఇలా పలు రకాల చర్యల వల్ల మురుగు నీరు శుద్ధి అయిన తర్వాత ఆర్‌వో ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో శుద్ధి అయిన నీటిని ప్రజా అవసరాలకు పంపిణీ చేసే విధానమే ఇక్కడి సీవేజ్ ప్లాంట్ పని.



నరవలో ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

పాడైన యంత్రాలు

అయితే అధికారుల నిర్లక్ష్యంతో యంత్ర సామగ్రి పని చేయని స్థితికి చేరాయి. ఇందులో కొన్ని యంత్రాలు మత్రమే పని చేస్తున్నాయి. మెకానికల్ చాంబర్, డిక్టేటర్,రాకింగ్ చాంబర్, వేరియేషన్ ట్యాంకర్, డిఫ్యూజర్ బ్లోయర్లు, క్లారిఫైర్లు పని చేయడం లేదు. దీంతో నీరు శుద్ధి జరగడం లేదు. ఎయిర్ బ్లోయర్స్ పని చేయక పోవడంతో నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోయి విషతుల్యంగా మారింది. ఇందులో చేపలు సైతం చనిపోయాయి. దీంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది.



పనిచేయని యంత్రాలు



అధికారుల చెకింగ్ సమయంలో పై నుంచి చెత్త వేసేందుకు సిద్ధం చేసి ఉంచిన వైనం

మాన్యువల్‌గా పని ..

యంత్రాలు పని చేయక పోవడంతో అన్ని పనులు మాన్యువల్‌గా చేస్తున్నారు. కనీసం సేఫ్టీ కిట్లు కూడా ఇవ్వడం లేదని కిందస్థాయి సిబ్బంది వాపోతున్నారు.అయినా మ్యాన్‌హోల్‌లోకి వెళ్లి శుభ్రం చేయాల్సి వస్తోందని ..అడిగితే వేధింపులకు గురి చేస్తున్నారుని ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు...

ఇక్కడి ప్లాంట్‌లో జరుగుతున్న అవినీతిపై కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపటాలని స్థానికులు, కార్మికులు కోరుతున్నారు. విషయాన్ని మేయర్ దృష్టికి కూడా తీసుకెళ్తాన్నామని చెబుతున్నారు. దీనిపై కలెక్టరే ప్రత్యేకంగా విచారణ చేపట్టి అవినీతి జలగలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆక్సిజన్ లేక మృతి చెందిన చేపలు

నిర్వహణ నిధులు స్వాహా!

ఈ ప్లాంట్ మెయింటెనెన్స్ కోసం ఏడాదికి రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు బిల్లు పెట్టకుని స్వాహా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాని ఇక్కడ యంత్రాలకు గ్రీజు పెట్టడానికి కూడా ఖర్చు పెట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిర్వహణలేక పోవడం వల్ల యంత్రాలు పాడయ్యాయని చెబుతున్నారు.

తనిఖీలకు వచ్చేవారికి మస్కా

ఈ ప్లాంట్‌ను తనిఖీ చేయడానికి వచ్చేవారిని ఇక్కడి అధికారులు బురిడీ కొట్టిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడి రాకింగ్ చాంబర్ వద్ద పై నుంచి ఒక ఉద్యోగి చేతితో మట్టిని కిందకు పడవేస్తారు. వ్యర్థాలను వేరు చేసి యంత్రాలు కిందకు పడి వేస్తున్నాయని కలరింగ్ ఇస్తారు. మంచినీరు వస్తుందని మినరల్ వాటర్‌లో సీవేజ్ వాటర్ కలిపి చూపించి కనికట్టు చేస్తారు. ఇదంతా అధికారుల మాయాజాలం.

క్లుప్తంగా

ఘనంగా పెంటమాంబ మారువారం



అన్నప్రసాదాలు వడ్డిస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి మారువారం పండగను ఆలయ చైర్మన్ నమ్మి గౌరేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెంటమాంబ అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు అమ్మవారికి పలు పిండి వంటలను సారె రూపంలో సమర్పించారు. లలిత పారాయణం పఠించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు,ఆలయ కమిటీ అధ్యక్షుడు గుండేపల్లి షణ్ముఖ, గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

బోరుబావులకు మరమ్మతులు



బోరును సరి చేసిన నీటి సరఫరా సిబ్బంది

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో మొరాయించిన బోరు బావులకు ఏకకాలంలో సోమవారం నీటి సరఫరా విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. 59,60,61వ వార్డుల పరిధిలో బోర్ల పనితీరును పరిశీలించారు. మరమ్మతులకు గురైన వాటిని వినియోగంలోకి తెచ్చారు. వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు సిబ్బంది తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం



వృద్ధురాలి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక బీసీ రోడ్డులోని అరుణోదయ లాడ్జి ఎదురుగా శ్రీ గృహప్రియ ఫుడ్స్ మెట్ల మీద గుర్తు తెలియని వృద్ధురాలి మృత దేహాన్ని స్థానికులు గుర్తించి గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు విచారణ చేపట్టారు. ఆమె వయసు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, 5 సంవత్సరాల నుంచి ఆమె అజీమాబాద్, కొత్తగాజువాక, బీసీ రోడ్డు పరిసరాల్లో షాపుల మెట్ల వద్ద నిద్రిస్తుందని తెలిపారు. ఆమె ఎవరు, కుటుంబ వివరాలు తెలియరాలేదు. పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎవరైనా గుర్తుపడితే గాజువాక సీఐ 9440796014, ఎస్ఐ 9642364770 నంబర్లకు తెలపాలని కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి



అప్పలరెడ్డి (ఫైల్)

కూర్మన్నపాలెం: మద్యం మత్తులో ఓ వ్యక్తి బావిలో పడి మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలి. పాలవలస గ్రామానికి చెందిన గొందేశి అప్పన్నరెడ్డి (41) సోమవారం ఉదయం ఇంటికి సమీపంలోని నేలబావిలో కాలు జారి పడి మరణించాడు. రెండు రోజుల కిందట మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామస్తులు బావిలో మృతదేహాన్ని గుర్తించిన ఆయన భార్య ప్రమీలకు తెలిపారు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బావిలోని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. సీఐ మల్లేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

6 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్త్రీ, జీఆర్పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోతనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లాకు చెందిన ఇమ్రాన్ నాఫిస్ షేక్ ను అదుపులోకి తీసుకుని, రూ.30 వేల విలువైన 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

సమ్మెపై యాజమాన్యం స్పందించాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు మద్దతుగా సోమవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ కార్మికుల తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని వారు చేస్తున్న పోరాటం న్యాయమైందన్నారు. తక్షణమే యాజమాన్యం స్పందించి కార్మిక సంఘాల నాయకులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికుల సమ్మె వల్ల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కె.ఎస్.ఎన్. రావు మాట్లాడుతూ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తుందన్నారు. స్టీల్ ఇంటక్ అధ్యక్షులు రమణమూర్తి , నాయకులు వై.టి. దాస్, కొమ్ము ప్రసాద్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

బెహరాలో ఉచితంగా నైపుణ్య శిక్షణ తరగతులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత నైపుణ్య శిక్షణతరగతులు నిర్వహించనున్నామని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య తెలిపారు. జూన్ 2 నుంచి 11 వరకు ఈ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగుతు జరుగుతాయని తెలిపారు. పాలిటెక్నిక్‌లో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పాలిటెక్నిక్‌లో ఆసక్తి ఉన్న కోర్సుల్లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కంప్యూటర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి వాటిపై వర్క్‌షాప్ ఉంటుందని చెప్పారు. గాజువాక, మద్దిలపాలెం, గోపాలపట్నం ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఉందని తెలిపారు. పూర్తి వివరాల కోసం 84980 53328, 80969 51452, 80741 01825, 63039 53129 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆదర్శవంతంగా వైశాఖి స్పోర్ట్స్ పార్క్



మాట్లాడుతున్న సనపల వరప్రసాద్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అన్నారు. వేములపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన పార్క్ వార్షిక సర్వసభ్య సమావేశంలో అయన మాట్లాడారు. వాకర్స్, సందర్శకుల అభిరుచిని తెలుసుకుని, వారికి కావాల్సిన సౌకర్యాలు అందుబాటులోకి తేవడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సహకారంతో నగరంలోనే అత్యుత్తమ పార్కుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. పార్కు కార్యదర్శి పి.వి.సూర్యనారాయణ రాజు ఏడాది కాలంలో నిర్వహించిన అభివృద్ధి, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల నివేదికను వివరించారు. కోశాధికారి మళ్ల రామకృష్ణ పార్క్ ఆదాయం, వ్యయం వివరాలు తెలిపారు. పార్క్ న్యాయ సలహాదారు జనపరెడ్డి పృథ్వీరాజ్, పూర్వ అధ్యక్షుడు అంబికా ప్రసాద్, ఎన్నికల సలహా మండలి సభ్యుడు రొంగలి జగన్నాథం, సంకు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్యవర్గం నిర్వహించిన అభివృద్ధి పనులను ప్రశంసించారు. ఉపాధ్యక్షులు పల్లా చంద్రమౌళి, శీతిన సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు రఘురామ పండ, పి.కంకరాజు, సంయుక్త కోశాధికారి కె.కె.సురేష్, కార్యవర్గ సభ్యులు ఎం.వి.రెడ్డి, టి.ఎస్.ఎన్.రాజు, సిహెచ్.రామారావు, పి.శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరరావు, పి.సన్యాసిరావు, ఎల్.వి.సుధాకర్, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

పోర్టు ఎస్సీ, ఎస్టీ సంఘం నూతన కార్యవర్గం కొలువు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవీశ్వరరావు మరోసారి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎం.సాల్మన్‌రాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ టీఎస్ దీప్తి, కె.వేణుగోపాల్, ఈ.వెంకట్రావు, పి.ప్రసన్నకుమార్‌ను, సంయుక్త కార్యదర్శులుగా పి.సుందరేషన్, కె.శ్రీను, సిద్ధార్థకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎం.ఎస్.రావు, బూరి శ్రీను, సంజీవరావు, కె.వి.రమణతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీనియర్ సభ్యుడు ఎం.ఎన్.ఎస్.ఎస్. సింగ్ ఆధ్వర్యంలో పోర్టు అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో పనిచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు,అతిథులు

మల్కాపురం: నిరంతరం పుస్తకాలు చదవి తన జీవితాన్ని సమాజ ఉన్నతికి అంకితం చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శప్రాయుడని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎన్నో కష్టాలను ఎదుర్కొని అంబేడ్కర్ భారత ప్రజలకు వెలుగు బాట చూపించారని అన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని,తర్కాన్ని ఆయన నుంచి అంతా నేర్చుకోవాలని ఆమె సూచించారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర,దేశానికి ఆయన అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో స్థానిక నాయకుడు పాపారావు, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నారు. కాంట్రాక్ట్ కార్మికులు ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ముట్టడికి కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు.

మానసిక చికిత్స కేంద్రం సందర్శన

మహారాణిపేట: చిన్న వాల్తేరులోని ప్రభుత్వ మానసిక రోగుల చికిత్స కేంద్రాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అనుమతితో ఆయన కేంద్రంలోని వార్డులను పరిశీలించారు. రోగుల మానసిక స్థితి, వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిని తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయలక్ష్మి, లీగల్ వలంటీర్ కె.ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ఆ తర్వాత సేవాధికార సంస్థ కార్యదర్శి కేజీహెచ్‌లోని వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించి బాధితులకు అందుతున్న సౌకర్యాలు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ వలంటీర్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు



లక్ష్మీనగర్‌లో విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న హెచ్‌ఎం మోహనరావు, కోఆర్డినేటర్ గీత

గోపాలపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే విద్యార్థుల భవితకు బాటలు తామేనని ఉపాధ్యాయులు ఇంటింట ప్రచారం చేస్తున్నారు. లక్ష్మీనగర్ ఈ బ్లాక్ మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెట్ట మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. భవిత కేంద్రం, ప్రాథమిక పాశాలల్లో పిల్లల్ని చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. వీటి ద్వారా ఏ విధమైన ప్రయోజనాలు కలుగుతాయో వారికి వివరించారు. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ గీత మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను భవితకేంద్రాల్లో చేర్పిస్తే ఎస్కార్ట్ అలవెన్స్ ట్రావిలింగ్ అలవెన్స్, స్కాలర్‌షిప్పులు వంటివి అందిస్తారని తెలిపారు. చదువుతో పాటు వారు ఆసక్తి చూపించే అంశంలో నైపుణ్యాన్ని పెంపొందిస్తారని అన్నారు. ఇందులో భాగంగా లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో చెల్లు బోయిన దివ్యను భవిత కేంద్రంలో చేర్పించారు. ఇంకా ఎవరైనా దివ్యాంగ విద్యార్థులు ఉంటే చేర్పించాలని హెచ్‌ఎం మోహనరావు కోరారు.

సీహెచ్‌సీలో కోవిడ్ అలెర్ట్



ఓపీ విభాగం వద్ద మాస్కులు ధరించిన వ్యాధిగ్రస్తులు, సిబ్బంది

గోపాలపట్నం: కోవిడ్ మళ్లీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కోవిడ్ నిబంధనలు పాటిస్తున్నారు. వ్యాధిగ్రస్తులు, వైద్యసిబ్బంది తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు. అందరూ మాస్కులు, శానిటైజర్ వాడడంతో పాటు పరిశుభ్రత పాటించాలని సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. కాగా ఇటీవల ఇక్కడ విధులు నిర్వహించి వెళ్లి ఓ వైద్యుడికి కోవిడ్‌సోకిందని తెలియగానే ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తమయ్యారు. దీంతో అందరూ మాస్కులు ధరిస్తున్నారు. కోవిడ్ నిబంధనలు పాటించాలని, ఓపీ తీసుకున్న చోట, వైద్యుల గదుల వద్ద సోషల్ డిస్టెన్స్ కూడా పాటించాలని సూచిస్తున్నారు.

పీజీఆర్ఎస్‌కు ఆరు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై ఆరు వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



• వ్యర్థాలు తొలగించరూ!

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల రక్షణ గోడను ఆనుకుని ఉన్న సేవామార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇక్కడ నిర్లక్ష్యంగా డంప్ చేసిన వ్యర్థాలను తినడానికి వస్తున్న పశువులు, పందులు పరిసరాలను మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. సేవా మార్గంలో డంప్ చేసిన వ్యర్థాలు సకాలంలో తొలగించక పోవడం వల్లే ఈ సమస్య తలెత్తుతుందని స్థానికులు చెబుతున్నారు. - మల్కాపురం